
గార: కుమ్మరిపేట వద్ద అడుగంటిన చెరువు

ఎండిన చెరువులు

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- నదులు సైతం నీరులేక వెలవెల
- క్రీడా మైదానాలను తలపిస్తున్న వైనం
- తాగు, సాగునీటికి తప్పని ఇబ్బందులు


సంతబొమ్మాళి: బోరుభద్రలో బంజీరు చెరువు దుస్థితి

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వేసవి తొలినాళ్లలోనే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో చెరువులు నిండుకున్నాయి. జీవనదులు సైతం సన్ననిపాయ మాదిరి ప్రవహిస్తున్నాయి. గతంలో వర్షాభావ పరిస్థితులు, ప్రస్తుతం ఉష్ణోగ్రతల ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. చెరువులు, నదుల్లో నీరులేక క్రీడా మైదానాలను తలపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా మైనర్ ఇరిగేషన్ చెరువులు 6,422 ఉన్నాయి. ఇందులో 9.85 టీఎంసీల నీరు నిల్వ ఉండాలి. ప్రస్తుతం అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం 7.96 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 3,872 చెరువులు నీటితో నిండి ఉన్నాయి. 1049 చెరువులు 75 శాతం నీటితో, 719 చెరువులు 50 శాతం నీటితో, 713 చెరువులు 25శాతం నీటితో ఉన్నాయి. మరో వారం పదిరోజుల్లో ఈ నీరు కూడా ఆవిరైపోయే అవకాశముంది. ఇక 68 సాగునీటి చెరువుల్లో చుక్కనీరు కూడా లేదు. పిచ్చిమొక్కలు సైతం మొలవకుండా.. క్రీడా మైదానం మాదిరి కనిపిస్తున్నాయి. వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు కనీస చర్యలు తీసుకోకపోవడం, చెరువులకు మరమ్మతులు చేయించకపోవడంతో నీటి కొరత తప్పడం లేదు.

● తప్పని నీటి కష్టాలు

పలాస మండలం తర్లకోట చెరువు పూర్తిగా ఎండిపోయింది. చెరువు దిగువన రైతులు సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. జి.సిగడాం మండలం గొబ్బూరు చెరువు పూర్తిగా పిచ్చిమొక్కలుతో నిండిపోయింది. పెంట, వీఆర్ పేట, వాం్రడంగి, దవళపేట, నిద్దాం, చెట్టుపొదిలాం గ్రామాల్లో చెరువులు అడుగంటిపోవడంతో సాగునీటికి, తాగునీటికీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. మెళియాపుట్టి మండలం సజ్జనాపురం చెరువు ఎడారిలా దర్శనమిస్తోంది. సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో బంజీరు చెరువు మైదానం మాదిరి మారిపోయింది. సయ్యద్‌ఖాన్ చెరువు, ఎర్ర చెరువును అధికారులు బాగుచేయించలేదు. కంచిలి మండలం ముకుందసాగరం ఎడారిలా మారిపోయింది. ఆమదాలవల మండలం జొన్నవలసలోని ఊరచెరువులో రెల్లగడ్డి విపరీతంగా పెరిగిపోయింది. కృష్ణాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని రాయల చెరువులో చుక్క నీరు లేక.. పిచ్చిమొక్కలతో నిండింది.


కంచిలి: ముకుంద సాగరం చెరువు ఇలా..

● ఇదీ నదుల పరిస్థితి...

ఒడిశా రాష్ట్రం నుంచి జిల్లామీదుగా వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా నదులు ప్రవహిస్తున్నాయి. వంశధార... సన్ననిపాయలా ప్రవహిస్తోంది. నరసన్నపేటలో వంశధార నదిలో పది శాతం కూడా నీరు లేదు. నాగావళి నది కూడా అలానే ఉంది. నది వెడల్పులో తొంభై శాతం ఇసుక మాత్రమే కనిపిస్తోంది. ఇచ్ఛాపురంలో బహుదా నది చెరువు కంటే అధ్వానంగా ఉంది. ఇక్కడి మున్సిపాల్టీ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే రోజువిడిచి రోజు కుళాయిలు ఇస్తున్నారు. ట్యాంకర్ ద్వారా రెండురోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే మహేంద్రతనయ.. వర్షాకాలంలో ఉగ్రరూపం.. వేసవిలో ఎప్పుడూ నిండుకోవడమే. హిరమండలం వద్ద గొట్టా బ్యారేజీ నీటి సామర్థ్యం 38.10 మీటర్లు కాగా.. నీటి నిల్వ ప్రస్తుతం 36.32 మీటర్లు మాత్రమే ఉంది. బ్యారేజీలోకి 130 క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తోంది.


మెళియాపుట్టి: సజ్జనాపురం చెరువు


నరసన్నపేట: ఎడారిని తలపిస్తున్న వంశధార నది


22.21 శాతం లోటు వర్షపాతం

జిల్లా ప్రస్తుతానికి 22.21 శాతం లోటు వర్షపాతం ఉంది. గణాంకాల ప్రకారం గతేడాది జూలై ఒకటి నుంచి మార్చి 31 వరకు 1020.16 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాలి. కేవలం 793.62శాతం వర్షపాతం నమోదైంది. అంటే -22.21 శాతం వర్షపాతం లోటు. ఈ ప్రభావంతో ఇటు చెరువులు నిండుకోగా.. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఇక సాగునీటి కాలువల నిర్వహణ చేపట్టకపోవడంతో ప్రాజెక్టుల నుంచి నీరు చెరువుల్లో చేరకుండా వృథాగా పోతోంది. వేసవి తొలినాళ్లకే ఇలా ఉంటే భవిష్యత్‌లో తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఒడిశా అధికారులతో మాట్లాడి.. నదుల్లో నీటి విడుదల శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


మహేంద్ర తనయ నదిలో పాయగా ప్రవహిస్తున్న నీరు


జి.సిగడాం: పెంటలో సాగునీటి చెరువు ఇలా..


ఇచ్ఛాపురం: బహుదా నది దుస్థితి..


హిరమండలం : గొట్టాబ్యారేజీలో ఉండేది ఈ కొద్ది నీరు మాత్రమే..


ఆమదాలవలస: రాయలచెరువు దుస్థితి


జలుమూరు: టెక్కలిపాడు వద్ద పట్టుబడిన నగదును తహసీల్దార్‌కు అప్పగిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో నగదు లభ్యం

● వేర్వేరుచోట్ల రూ.5.50 లక్షలకుపైగా స్వాధీనం

పలాస/ జలుమూరు, ఏప్రిల్ 2: ఎన్నికల వేళ ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో అధిక మొత్తం నగదు పట్టుబడుతూనే ఉంది. మంగళవారం పలాస మండలం కొత్తఊరు జంక్షన్ వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ నిర్వహించారు. రెంటికోట గ్రామం నుంచి పలాస ద్విచక్ర వాహనంపై వెళ్తున్న స్రవంతి అనే మహిళ రూ.2.50 లక్షల నగదును గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి ఎటువంటి పత్రాలు లేక పోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు.

● జలుమూరు మండలం టెక్కలిపాడు వద్ద తనిఖీల్లో రూ.3,01,400 పట్టుబడినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి తిరుపతిరావు తెలిపారు. నరసన్నపేట మండలం పొన్నా నపేటకు చెందిన పొన్నాన రామారావు.. చల్లవానిపేట కూడలి నుంచి నరసన్నపేట వైపు ద్విచక్రవాహనంపై ఎటువంటి ఆధారాలు లేకుండా ఈ నగదు తీసుకెళ్తున్నట్టు గుర్తించామన్నారు. ఈ నగదును తహసీల్దార్ సీహెచ్ నాగమ్మకు అప్పగించగా.. సీజ్ చేసి నరసన్నపేట ఆర్వో రామ్మోహనరావుకు అందజేశామని తెలిపారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ఎచ్చెర్ల, ఏప్రిల్ 2: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం)లో నిర్వహించనున్న కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ ఎం. నవీన్ మంగళవారం పరిశీలించారు. ఈవీఎంలకు భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వాహనాల రాకపోకలకు అనువుగా ఏర్పాటు చేసిన రహదారి పనులను పరిశీలించారు. 'జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చే ఈవీఎంలను స్పష్టమైన విధానంలో స్వీకరించి భద్రత పర్చాలి. విధుల్లో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ పాటించాలి' అని కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు తీసుకువచ్చే క్రమంలో గట్టి పోలీసు భద్రత, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సమన్వయం చేసే విధానాన్ని ఎస్పీ జీఆర్ రాధిక వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.గణపతిరావు, ఆర్డీవో సీహెచ్.రంగయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, తహసీల్దార్ శ్యాంకుమార్ పాల్గొన్నారు.


శివానీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులు ఖరారు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

కాంగ్రెస్ పార్టీ.. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తమ అభ్యర్థులను ప్రకటించింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలుండగా.. టెక్కలి మినహా ఇతర ఏడుచోట్ల అభ్యర్థులను ఖరారు చేసింది. ఈమేరకు పార్టీ అధిష్ఠానం జాబితాను విడుదల చేసింది. కేంద్రమాజీమంత్రి, వైసీపీ నేత కిల్లి కృపారాణి త్వరలో ఆ పార్టీకి రాజీనామా చేసి.. మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరతారనే ప్రచారం సాగుతోంది. టెక్కలి అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమె బరిలో నిలుచునే అవకాశముందని తెలుస్తోంది.

నియోజకవర్గం	అభ్యర్థి పేరు
ఇచ్ఛాపురం	మసుపత్రి చక్రవర్తి
పలాస	మజ్జి త్రినాథ్ బాబు
పాతపట్నం	కొప్పురోతు వెంకటరావు
శ్రీకాకుళం	పైడి నాగభూషణరావు
ఆమదాలవలస	సనపల అన్నాజీరావు
ఎచ్చెర్ల	కరిమజ్జి మల్లేశ్వరరావు
నరసన్నపేట	మంత్రి నరసింహమూర్తి

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

అరసవల్లి, ఏప్రిల్ 2: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశామని జిల్లా విద్యాశాఖాధికారి వేంకటేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని తుమ్మావీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు పప్పల సత్యనారాయణ గత నెల 17న తోలాపిలో రాజకీయపార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. దీనిపై విచారణ చేపట్టిన మండల విద్యాశాఖాధికారి వాస్తవమేనని ధ్రువీకరించారని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు స్పష్టం కావడంతో ఆయనను సస్పెండ్ చేశామన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ఎచ్చెర్ల, ఏప్రిల్ 2: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్‌కు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం)లో ఉచిత కోచింగ్ ఇస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదరరావు, పాలిసెట్ జిల్లా సమన్వయకర్త పి.యుగంధరరావు తెలిపారు. కళాశాల ఆవరణలో మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. 'పాలిసెట్ ఈ నెల 27న ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు జరుగుతుంది. ఈ నెల 25 వరకు కోచింగ్ నిర్వహించి, స్టడీ మెటీరియల్ ఇస్తాం. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు చెరో ఐదేసి వంతున ఉన్నాయి. ఈ నెల 5 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. ఏమైనా సందేహాలుంటే శ్రీకాకుళం, టెక్కలిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లోని సహాయ కేంద్రాలను లేదా.. 9912342008 నెంబర్‌లో సంప్రదించాల'ని వారు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పు

అరసవల్లి, ఏప్రిల్ 2: పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. 'ఈ నెల 4 నుంచి మే 31 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే కేంద్రాలు పనిచేస్తాయి. మధ్యాహ్న భోజనం అనంతరం చిన్నారులను ఇంటికి పంపిస్తారు. కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. మే 1వ తేదీ నుంచి 15 వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, మే 16 నుంచి 30 వరకు అంగన్‌వాడీ సహాయకులు వేసవి సెలవులను ఉపయోగించుకోవచ్చ'ని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్‌గా హరిబాబు



అరసవల్లి, ఏప్రిల్ 2: జిల్లా నూతన పోస్టల్ సూపరింటెండెంట్‌గా వండాన హరిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలకు పూర్తి స్థాయిలో తపాలా శాఖ ద్వారా వివిధ రకాల పథకాలను, బీమాను, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సేవలను అందిస్తామని తెలిపారు.

హమ్మయ్య.. చిక్కింది


బోనులో ఎలుగుబంటి

- పాడుపడిన ఇంట్లో పట్టుబడిన ఎలుగుబంటి
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 2: తీర ప్రాంతవాసులకు కొన్నినెలలుగా కంటిమీది కునుకు లేకుండా చేస్తున్న ఎలుగుబంటిని జూ అధికారులు చాకచక్యంగా పట్టుకుని బోనులో బంధించారు. వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరులో సోమవారం అర్ధరాత్రి పాడుపడిన ఇంట్లోకి ఎలుగుబంటి ప్రవేశించింది. ఆ సమయంలో కుక్కలు బిగ్గరగా అరవడంతో స్థానికులు కొమర దమయంతి, గండుపల్లి మోహన్ చూడగా ఎలుగుబంటి కనిపించింది. వేకువజామున 5 గంటలకు స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేశారు. అటవీశాఖాధికారిణి నిషాకుమారి ఆధ్వర్యంలో అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఎలుగుబంటిని బయటకు పంపించే ప్రయత్నాలు చేశారు. ఇంటి చుట్టూ వలలు, ఇనుప ఊచలు అడ్డంగా ఉంచారు. ఎలుగుబంటిని పట్టుకోవాలనే ఉద్దేశంతో విశాఖపట్నం జూ అధికారులకు సమాచారం అందజేశారు. మంగళవారం మధ్యాహ్నం రిస్క్యూటీం చేరుకొంది. గతంలో కిడిసింగి వద్ద మత్తుమందు ఇచ్చి పట్టుకున్న ఎలుగుబంటి మృతి చెందింది. ఈ నేపథ్యంలో మత్తుమందు లేకుండా ఎలాగైనా ఎలుగుబంటిని బంధించాలనే ఉద్దేశంతో బోనును ఇంటి ముందు ఉంచారు. ఇంటి పైకప్పు పైన, వెనుక నుంచి శబ్దాలు చేశారు. దీంతో ఇంటిలోపల నుంచి ఎలుగుబంటి బయటకు రాగా బోనులో బంధించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు 12 గంటల పాటు 50 మంది సిబ్బంది శ్రమించి ఎలుగుబంటిని బంధించడంతో గ్రామస్థులు అభినందించారు. ఎలుగుబంటిని విశాఖ జూకు తరలించినట్టు అధికారులు తెలిపారు. రిస్క్యూటీంలో డీఎఫ్‌వో నిషాకుమారి, సబ్ డీఎఫ్‌వో నీరంజన్, రెడ్డి, పోలయ్య, వెంకటరావు తదితరులు ఉన్నారు.


ఇంట్లో ఉన్న ఎలుగుబంటిని బంధించేందుకు ప్రయత్నిస్తున్న అటవీశాఖ, జూ అధికారులు

ఆ బ్యాంకులో.. రుణాల కుంభకోణం?

- వారం రోజులుగా అధికారుల అంతర్గత విచారణ
- వ్యక్తిగత రుణాలు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు
- వివరాలు బయటకు వెల్లడించని బ్యాంకు సిబ్బంది



నరసన్నపేట/శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 2: నరసన్నపేటలోని ఓ బ్యాంకు కార్యాలయంలో రూ. కోట్లలో రుణాల కుంభకోణం జరిగిందనే ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే వ్యక్తిగత రుణాల్లో బ్యాంకు సిబ్బంది చేతివాటం చూపించారనే ఆరోపణలున్నాయి. వారం రోజులుగా అధికారులు అంతర్గత విచారణ చేస్తున్నారు. ఏడాదిన్నరగా ఉద్యోగులు వ్యక్తిగత రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొందరి డాక్యుమెంట్ల ఆధారంగా బ్యాంకు సిబ్బందే బినామీ ఖాతాలు తెరిచి వ్యక్తిగత రుణాలు పక్కదోవ పట్టించినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో ఉద్యోగులకు సమాచారం(మెసేజ్) వెళ్లకుండా సాంకేతికపరంగా ఆయా ఖాతాలను ఫ్రీజ్ చేసి ఈ తతంగం నడిపించినట్టు సమాచారం. బినామీ ఖాతాదారుల పేరుతో ప్రతీ నెలా బ్యాంకులో చెల్లింపులు చేయడంతో ఈ వ్యవహారం బయటపడలేదు. కాగా ఇటీవల వార్షిక తనిఖీల్లో అక్రమాలు బయటపడ్డాయని, దీనివెనుక జిల్లా స్థాయి ఉన్నతాధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

● నరసన్నపేట బ్యాంకు కార్యాలయంలో మంగళవారం కూడా తనిఖీలు చేపట్టారు. సాధారణంగా ఆర్థిక సంవత్సరం చివరినాటికి బ్యాంకుల్లో తనిఖీలు పూర్తిచేస్తారు. కానీ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో తనిఖీలు చేయడం చాలా అరుదు. ఆమదాలవలస శాఖ బ్యాంకు అధికారి ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. బ్యాంకులో వ్యక్తిగత రుణాలతో పాటు ఇతర లావాదేవీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

ఖాతాదారుల్లో ఆందోళన

● గారలోని ఓ బ్యాంకులో ఖాతాదారులు తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలు ఇటీవల మాయం కాగా.. పోలీసులు నిందితులను పట్టుకున్నారు. ఈ ఘటన మరువక ముందే నరసన్నపేటలోని ఓ బ్యాంకులో రుణాల కుంభకోణం జరిగిందనే ప్రచారం సాగడంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో గార బ్రాంచ్‌లోని బంగారం తాకట్టులో నరసన్నపేట బ్రాంచ్‌కు చెందిన ఉద్యోగి కీలకంగా వ్యహరించారు. ఇప్పుడు అదే ఉద్యోగి నరసన్నపేట బ్రాంచ్‌లో కూడా ప్రమేయం ఉంటుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై వివరణ కోరగా.. సంబంధిత ఉద్యోగి తప్పించుకునే ధోరణితో వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. విజిలెన్స్ అధికారులకు కూడా ఆయన అందుబాటులో లేనట్టు బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. ఈ విషయమై అధికారులు లోతైన విచారణ చేపట్టి.. అక్రమాలు బయటపెట్టాల్సిన అవసరం ఉంది.

● నరసన్నపేట బ్యాంకులో రుణాలకు సంబంధించిన వ్యవహారంలో ఎలాంటి పొరపాట్లు జరిగే అవకాశం లేదని మేనేజర్ తెలిపారు. ఉద్యోగుల శాలరీ ఖాతాకు మాత్రమే వ్యక్తిగత రుణాలు తీసుకుంటే జమవుతాయని, పక్కదారి పట్టే అవకాశం ఉండదన్నారు. పొరపాట్లు జరిగితే శాఖాపరంగా ఇప్పటికే చర్యలు ఉండేవని స్పష్టం చేశారు.

జీడి పప్పు తయారీలో వారికే ప్రాధాన్యం

● అన్ని పరిశ్రమల్లోనూ మహిళలే అధికం
● 70 ఏళ్లుగా దేశ, విదేశాలకు పలాస నుంచి పప్పు ఎగుమతి

(పలాస)

జీడి పప్పు అనగానే ఠక్కున గుర్తుకొచ్చేది పలాస-కాశీబుగ్గ.. దేశ, విదేశాలకు ఇక్కడి నుంచి ఎగుమతులు జరుగుతున్నాయంటే ఇక్కడి జీడిపప్పునకు ఎంత ప్రాధాన్యం ఉందో అర్థమవుతుంది. సుమారు 70 ఏళ్ల చరిత్ర ఉన్న పలాస జీడిపప్పు తయారీలో మహిళల శ్రమే అధికంగా ఉంటోంది. మొదటిలో పొయ్యిలో జీడిపిక్కలు కాల్చి చిన్న, చిన్న ప్యాకెట్లు తయారు చేసి విక్రయించేవారు. ఆ తరువాత డ్రమ్ము రోస్టింగ్, ప్రస్తుతం బాయిలింగ్ విధానంలో జీడి పిక్కలను తయారు చేస్తున్నారు. ఈ మూడు ప్రక్రియల్లోనూ మహిళా కార్మికులు తమ కష్టాన్ని ధారపోసి జీడిపప్పును తయారు చేస్తున్నారు. ఎంతో రుచికరంగా ఉండే పలాస జీడిపప్పు రుచి వెనుక మహిళలదే ప్రధాన భూమిక. జిల్లాలో 340 వరకు జీడి పరిశ్రమలు ఉండగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోనే 250కు పైగా పరిశ్రమలున్నాయి. దేశంలో కేరళ రాష్ట్రం తరువాత మన రాష్ట్రంలోనే ఎక్కువగా జీడి పంట ఉంది. 34 వేల హెక్టార్లలో జీడి పంట వరి తరువాతి స్థానాన్ని ఆక్రమించిందంటే దాని ప్రాధాన్యం గుర్తించవచ్చు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య రహితంగా పరిశ్రమలను నిర్వహించాలని అధికారుల ఆదేశాల మేరకు చిన్న పరిశ్రమల నుంచి పెద్ద పరిశ్రమలు ఈ దిశగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని జీడిపప్పు తయారీ చేస్తున్నాయి. పలాసలో తయారయ్యే జీడి పప్పు దేశ అవసరాలు తీర్చడంతో పాటు అరబ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతోంది. బాదం, పిస్తా పప్పు లతో జీడి పప్పు పోటీ పడుతూ అదే రేటుతో ప్రస్తుతం మార్కెట్‌లో లభ్యమవుతోంది. అయితే సామాన్యుడికి అందుబాటులో ఉండే జీడి పప్పు ప్రస్తుతం సంపన్నులు నిత్యం వినియోగించుకుంటున్న పరిస్థితికి చేరుకుంది. వివాహ, ఇతర వేడుక ల్లోనూ జీడి పప్పును ఎక్కువగా వినియోగిస్తున్నారు. పలాస జీడి పప్పుకు రాష్ట్ర ప్రభుత్వం పేటెంట్ హక్కులను కూడా కల్పించింది. నూజివీడు బంగినపల్లి, తిరుపతి బాలాజీ లడ్డూ తరువాత పలాస జీడి పప్పుకే ఆ ప్రాధాన్యత ఉందంటే ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ప్రభుత్వ పరంగా భారీ పరిశ్రమలు పెట్టి వేలాది మందికి ఉపాధి కల్పిస్తుంటే కుటీర పరిశ్రమగా ప్రారంభమైన పలాస జీడి పరిశ్రమ నేడు వేలాది మంది కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లభించకపోయినా ఆ స్థాయిలో ఉపాధి కల్పిస్తూ చరిత్ర సృష్టిస్తోంది. దీని వెనుక పరిశ్రమల యజమానులతో పాటు మహిళా శక్తే అధికంగా ఉందనడంలో సందేహం లేదు.



జీడి పప్పు తయారు చేస్తున్న మహిళలు



కాంగ్రెస్‌లోకి కృపారాణి?



● టెక్కలి నుంచి బరిలోకి..!

టెక్కలి, ఏప్రిల్ 2: కేంద్ర మాజీ మంత్రి, వైసీపీ పూర్వ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కిల్లి కృపారాణి తిరిగి సొంతగూటికి చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార వైసీపీ పార్టీలో టెక్కలి అసెంబ్లీతో పాటు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆశపడి భంగపడిన ఆమె కాంగ్రెస్‌లో చేరి రాజకీయాల్లో చురుగ్గా ఉండేలా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమెకు అధికార పార్టీలో అన్యాయంతో పాటు పలు సందర్భాల్లో అవమానాలు సంభవించాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి రాజీనామా చేసి టెక్కలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున అసెంబ్లీ బరిలో పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. త్వరలో తెలంగాణా రానున్న కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్‌లో చేరాలని ఆమెకు ఏఐసీసీ స్థాయి నుంచి పీసీసీ అధ్యక్షుల వరకు ఆహ్వానించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా జిల్లాలో టెక్కలి మినహా మిగిలిన అన్ని స్థానాలకు అభ్యర్థులను ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ విడత గెలుపోటములను పక్కన పెట్టి 2029 నాటికి బలమైన అభ్యర్థిగా తయారయ్యేందుకు కాంగ్రెస్‌లో చేరడం అనివార్యమని ఆమె ఒక నిర్ణయానికి వచ్చినట్లు అనుయాయులు చర్చించుకుంటున్నారు.

సొంత కాంట్రాక్టర్ల లబ్ధే జగన్ లక్ష్యం: ఎంజీఆర్

పాతపట్నం: సొంత కాంట్రాకర్ల లబ్ధే సీఎం జగన్ లక్ష్యమని, అందుకే వైసీపీ పాలనలో నిధుల మళ్లిం పునకు పాల్పడుతున్నారని పాతపట్నం నియోజకవర్గ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బందితో పింఛన్లు పంపిణీ చేసేందుకు అవకాశం ఉన్నా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీనివల్ల పింఛన్‌దారులు నష్టపోతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేల పింఛన్ అందిస్తామన్నారు. టీడీపీ- జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి సలాన శరత్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, కొత్తూరు మండల నాయకులు అగతముడి మాధవరావు, మాతల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పాతపట్నం: విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను నిర్దేశించు కుని, ఆ దిశగా చదువుకోవాలని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కణితి శ్రీరాములు అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ ఫంక్షన్ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ చక్రపతి మాట్లాడుతూ.. డిగ్రీ అనంతరం ఉన్నతవిద్యావకాశాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు చేసిన పలు సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై చర్యలు తీసుకోండి



ఎంపీడీవోకి వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

మెళియాపుట్టి: వైసీపీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమారుడు శ్రావణ్ కుమార్ సోమవారం గొప్పిలిలో నిర్వహించిన ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల యువ జన కార్యదర్శి పరమేష్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఎంపీడీవో జి.భాస్కరరావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన కోయ్య సీతారాం, తులసీ సురేష్‌లు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై ఆధారాలతో వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొనకూడదు

పోలాకి: సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ నాయకుల వెంట వలంటీర్లు, ఉపాధి సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉషశ్రీ అన్నారు. మంగళవారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రచారంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు వస్తే క్షమించేది లేదన్నారు. ప్రత్యేక నిఘా ఉంచామని ప్రచారంలో పాల్గొంటే నోటీసు లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ గెలుపు తథ్యం: బగ్గు



రావులవలసలో ప్రచారం చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఏప్రిల్ 2: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని నరసన్నపేట నియోజకవర్గ ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణ మూర్తి అన్నారు. మంగళవారం రావులవలస, గుండువిల్లిపేట, శ్రీరామపురం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రం లో పాలన అస్తవ్యస్తంగా మారిందని, మరలా గాడిలో పెట్టాలంటే చంద్రబాబును సీఎంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందించి అవగాహన కలిగించారు. పేదల అభ్యున్నతే టీడీపీ-జనసేన-బీజేపీ లక్ష్యమన్నారు. ● వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఇంటింటికీ పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయించాలని రమణమూర్తి కోరారు. ఈ మేరకు ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ బలగ ప్రవీణ్, టీడీపీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు సూర్యనారా యణ, ధర్మాన తేజ్‌కుమార్, శిమ్మ జగన్నాథం, పల్లి శంకరనారాయణ, పంచిరెడ్డి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రభుత్వంలో 50 ఏళ్లకే పింఛన్: గోవిందరావు



బీసీ డిక్లరేషన్‌ను ప్రదర్శిస్తున్న ఉమ్మడి అభ్యర్థి గోవిందరావు

పాతపట్నం: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ సదుపాయం కల్పిస్తామని పాతపట్నం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని.. బ్యాక్‌బోన్ క్లాసెస్ అని అన్నారు. ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ పాలనలో బీసీల రిజర్వేషన్ తగ్గించిందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 34 శాతం రిజర్వేషన్ పునరుద్ధరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

● పలు గ్రామాల నుంచి వైసీపీ నేతలు..



టీడీపీలో చేరిన కొండలోగాం వైసీపీ నేతలతో గౌతు శిరీష

పలాస/హరిపురం: పలాస నియోజకవర్గం టీడీపీలో రోజు రోజుకూ వైసీపీ నుంచి నేతలు, కార్యకర్తలు చేరుతున్నారు. మంగళవారం పలాస పార్టీ కార్యాలయంలో మందస మండలం కొండలోగాం, గోపుటూరు, రామరాయి, కొయ్యటూరు, సాబకోట, బిత్రబంద, మాణి క్య పట్నం గ్రామాల నుంచి 100 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. కుంటికోట పంచాయతీ వాసుదేవపురంలో సుమారు పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి పలాస అభ్యర్థి గౌతు శిరీష కండువాలు వేసి ఆహ్వానిం చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రట్టి లింగరాజు, శేఖర్, భావన దుర్యోదన, లబ్బ రుద్రయ్య, జీకే నాయుడు, దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, ఈశ్వరరావు, పండా పాల్గొన్నారు. ● పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఐదో వార్డు తాళభద్రలోని పాయకరామ్‌పురం గ్రామంలో వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. సోమవారం రాత్రి పలాస అభ్యర్థి గౌతు శిరీష గ్రామానికి వెళ్లగా వారంతా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వర రావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్య నారాయణ, ఎ.రామకృష్ణ, కొత్త సత్యం, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్ గుప్తా, జోగ మల్లి, దడియాల నర్సింహులు, గోళ్ల చంద్రరావు పాల్గొన్నారు.

పచోరీ కాలనీలో కార్డెన్ సెర్చ్



నరసన్నపేట: పట్టణంలో పచోరీ కాలనీలో సీఐ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో అపరచితులు గ్రామాల్లో పర్యటిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు సాగకుండా చర్యలు తీసుకుంటా మన్నారు. ఇంటింటా తనిఖీలు నిర్వహించి ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న దిచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్‌లు



నందిగాం: మండలంలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 6 నుంచి నిర్వహిం చనున్న ఎస్ఏ-2 పరీక్షలకు సం బంధించిన ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు మంగళవారం మండల రీసోర్స్ కేంద్రానికి వచ్చాయని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ. చిన్నారావు తెలిపారు. ఆరు నుంచి 14వ తేదీ వరకు జరగ నున్న పరీక్షలకు గాను సీఆర్పీల ద్వారా పాఠశాలలకు ప్రశ్నాపత్రాలు బుధవారం నుంచి అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం

జలుమూరు (సారవకోట): సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమం సాధ్యమని నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. పెద్దలంబ పంచాయతీలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతో రాష్ట్రాభివృద్ధి

● టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. రంగోయి గ్రామంలో మంగళవారం ప్రజాగళం కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నేతలు కుత్తుమ లక్ష్మణరావు, కిక్కర ఢిల్లీరావు, దువ్వాడ సంతోష్, దువ్వాడ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

● **పలాసరూరల్:** టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 11, 12వ వార్డులో పార్టీ కార్యాలయాలను మంగళవారం ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో గౌతు శిరీషను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో అన్ని వర్గాలకు ఫలాలు

● **సంతబొమ్మాళి:** టీడీపీ అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. మంగళవారం ఇజ్జువరంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వంలో అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **టెక్కలి:** తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. మంగళవారం బొప్పాయిపురం పంచాయతీ విక్రంపురంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **బొద్దాం(పోలాకి):** టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు మిరియబ్బిల్లి వెంకట అప్పలనాయుడు, నియోజకవర్గ ఎన్నికల ప్రచార కార్యదర్శి బగ్గు అర్చన కోరారు. మంగళవారం బొద్దాం, ఇలపండపేట, వనివిష్ణుపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నేతలు బైరి భాస్కర రావు, నల్లాన వెంకు నాయుడు, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న పాతపట్నం సీఐ నల్లి సాయి

మెళియాపుట్టి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో వివాదాలకు దూరంగా ఉండాలని పాతపట్నం సీఐ నల్లి సాయి సూచించారు. సోమవారం రాత్రి వసుంధర గ్రామంలో ప్రజలతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. నేర ప్రవర్తన కలిగిన వ్యక్తులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఏవైనా సంఘటనలు జరిగితే వెంటనే సమాచారం అందించాలన్నారు. తగాదాలు పడితే బైండోవర్ కేసులు నమోదు చేయటం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

పోలాకి: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సీఐ ప్రసాదరావు, ఎస్ఐ సత్యనారా యణ తెలిపారు. మంగళవారం ఎన్నికల నిఘా ప్రత్యేక పోలీసులు డోల గ్రామంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుసరాం, గంగివలస, డోల, ప్రియాగ్రహారం, బెలమర, దీర్ఘాశి గొల్లలవలస, కోడూరు, తలసముద్రం గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారన్నారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామపెద్దలకు ఎన్నికల నిబంధనలు తెలియజేస్తామన్నారు. ఎన్నికల కోడ్ తొలగించే వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొండభీంపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి, ఏప్రిల్ 2: మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్, టెక్కలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ మంగళవారం పరిశీలించారు. జీడిపేట, వంగర, వీఆర్‌కేపురం, మేఘవరం, సీతాపురం, తిర్లంగి, అయోధ్యపురం, కొండభీంపురం, లచ్చన్నపేట, కాంట్రగడ పోలింగ్ కేంద్రా లను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలపై సిబ్బందితో ఆరా తీశారు.అలాగే వివిధ రాజకీయ పార్టీలతో తన కార్యాలయంలో సమీక్షించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదు లపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఆర్‌వో మురళీకృష్ణ, బగాది శేషగిరి (టీడీపీ), బోకర నారాయణరావు (బీఎస్పీ), నంబూ రు షణ్ముఖరావు (సీపీఎం) పాల్గొన్నారు.

నాలుగు రోజులు ఆగండి

● 'కలమట'తో చంద్రబాబు

మెళియాపుట్టి: మరో నాలుగు రోజులు ఆగి మళ్లీ రావాలని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూచించినట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం కలమటతో పాటు అనుచరులు చంద్రబాబును కలిసి సుమారు గంట పాటు చర్చలు జరిపారు. గతంలో చేసిన సర్వే వివరాలు తీసుకువచ్చినట్లు తెలిసింది. మా కుటుంబానికి 40 ఏళ్ల రాజ కీయ చరిత్ర ఉందని, తమను కదని ఇతరులకు టికెట్ కేటాయించడం ఏమిటని కలమట అన్నట్లు సమాచారం. తనకు అన్నీ తెలుసునని, ఎంపీతో కలిసి రావాలని, న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిసింది.


రేపటి నుంచి అంగన్‌వాడీలకు ఒంటిపూట

మెళియాపుట్టి: అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం నుంచి ఒంటిపూట విధులు నిర్వహించాలని పాత పట్నం ఐసీడీఎస్ పీవో విమలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రత వల్ల ఉదయం 8 గంటలకు కేంద్రాలను తీసి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉండాలన్నారు. వేసవిలో చిన్నారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

కంచిలి: తనకు అదనపు కట్నం తీసుకురావాలని భర్తతోపాటు అత్త, మామ, ఆడపడుచు శారీరక, మానసికంగా వేధిస్తున్నారని ఓ వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఎస్‌ఐ జి.రాజేష్ కథనం మేరకు.. మండలంలోని ఏఎస్ పల్లికి చెందిన బుడ్డెపు కృష్ణవేణికి కామేష్‌తో 2023లో వివాహం జరిగింది. పెళ్లి జరిగిన మూడు నెలల నుంచే భర్తతో పాటు అత్త, మామ, ఆడపడుచు అదనంగా రూ.1.50 లక్షలు తీసుకు రావాలని తరచూ వేధించేవారని బాధితురాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కుటుంబ సభ్యులపై పోలీసులు వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు.

బారువలో అగ్ని ప్రమాదం


దగ్ధమవుతున్న షాపు

సోంపేట: బారువలోని ఓ టీ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో రూ.80 వేల ఆస్తినష్టం సంభవించినట్టు బాధితుడు బోటో కృష్ణ తెలిపాడు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

గార మండలంలో తోటలు..


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గార: శ్రీకూర్మం, నగిరెడ్లపేట గ్రామంలో మంగళవారం ప్రమాదవశాత్తూ జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు నాలుగు ఎకరాలు విస్తీర్ణంలో కొబ్బరి, జీడి, మామిడి, నీలగిరి చెట్లు కాలిపోయాయి. సమాచారం అందుకున్న శ్రీకాకుళం నుంచి రెండు అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలు అదుపు చేశాయి. గార తహసీల్దార్ కె.కృష్ణ, ఆర్‌ఐ అనిల్ కుమార్, వీఆర్వో జగదీష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. 19 మంది రైతులకు చెందిన చెట్లు కాలిపోవడంతో అధికారులు పంట నష్టం అంచనా వేసి నివేదికను సంబంధిత అధికారులకు పంపించారు.

తెలికిపెంటలో కార్డన్‌సెర్చ్


పోలీసులు గుర్తించిన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంటలో మంగళవారం తెల్లవారుజామున సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.నిహార ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ సిబ్బందితోపాటు ఆర్‌పీఎఫ్ బలగాలతో తనిఖీలుచేశారు. ఎటువంటి పత్రాలు లేని పది ద్విచక్రవాహనాలను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలిం చారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ నిహార్ ద్విచక్ర వాహన చోదకులు వాహనాలు క్రయవిక్రయాల సమయంలో పత్రాలన్నీ సరిచూసుకోవాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వాహనాలు కొనుగోలు చేయకూడదని అవగాహన కల్పించారు.

మొబైల్ ఫోన్లు అందజేత


బాధితునికి ఫోన్ అందిస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో ప్రజలు పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అతి తక్కువ సమయంలోనే రికవరీ చేసిన బాధితులకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక అందజేశారు. సీఈఐఆర్.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న బాధితుల వివరాల మేరకు విచారణ చేపట్టి, రికవరీ చేసి అందిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. మొబైల్ ఐఎంఈఐ నెంబర్లు బ్లాక్ అయిన తరువాత రిక్వెస్ట్‌ను రిసీవ్ చేసుకుని మొబైల్‌ను ట్రాక్ చేసి పట్టుకుంటున్నట్టు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 146 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామని ఎస్పీ రాధిక తెలిపారు. ఇదివరకు జిల్లాలో లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా 244 ఫోన్లను రికవరీ చేశామన్నారు. మరో 56 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ విధానంలో ఇప్పటివరకు 446 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. వాటి విలువ సుమారు రూ.55 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఫోన్ సెక్యూరిటీ లాక్ వినియోగించాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్లో ఉంచకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. దూర ప్రాంతాల్లో ఉన్న ఫోన్లతో పాటు అతి విలువైన ఫోన్లు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సైబర్ సెల్ సీఐ టి.శ్రీను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

హెటిరోకు కాకినాడ ఆదిత్య విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

గుజరాతీపేట: స్థానిక ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గల కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఫార్మా కంపెనీ హెటిరో డ్రగ్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలు మంగళవారం నిర్వహించింది. ఇందులో సుమారు 300 మంది విద్యార్థులు హాజరు కాగా, కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎన్‌వీ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలలో ప్రతి ఏటా విద్యార్థులు ప్రముఖ కంపెనీల నుంచి అత్యధిక క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికవుతున్నారని, ఇప్పటి వరకు ఈ విద్యాసంవత్సరంలో 45 కంపెనీల ద్వారా సుమారు నాలుగు వేల మంది ఆదిత్య విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. డిగ్రీ ఐదో సెమిస్టర్ నుంచే విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ.. కాకినాడ ఆదిత్య కళాశాలలో విద్యార్థులకు డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూల కోసం తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. హెటిరో కంపెనీకి ఎంపికైన వారికి రూ.2.74 లక్షల వేతనం ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ వీఈవీఎల్ నాయుడు, డైరెక్టర్ ఎస్.చక్రవర్తి, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

రహదారి పనులు పూర్తయ్యేదెప్పుడో?

- నత్తనడకన పెంట-పాగిరి బీటీ రోడ్డు నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

జి.సిగడాం: పెంట-పాగిరి రహదారికి ఇప్పట్లో మోక్షం కలిగేలా కనిపించడం లేదు. శిలాఫలకానికే పరిమితమైన చందంగా ఉంది ఈ రహదారి పరిస్థితి. ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు కష్టాలు ఇప్పట్లో గట్టెక్కేనట్టు కనిపించడం లేదు. ఈ రహదారి పూర్తయ్యేదెప్పుడు.. ప్రయాణికుల కష్టాలు తీరేదెప్పుడు అని గ్రామస్థులతో పాటు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేసుతన్నారు. పెంట నుంచి పాగిరి కూడలికి సుమారు రెండున్నర కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి రూ..1.30 కోట్ల నిధులతో ఈ ఏడాది జనవరి 26న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ వస్తుంది అదరాబాధరాగా రోడ్డుకు శంకుస్థాపన చేసి ప్రజల మెప్పు పొందాలనే ఆలోచనతో అధికార పార్టీ నాయకులు ఈ పనులకు శంకుస్థాపన చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెలితే నిరసన సెగ తగులుతుందనో, చెప్పుకోవటానికి ఏమిలేదనో హడావిడిగా ప్రారంభించిన రోడ్డు పనులు ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న సందంగా మారింది. రోడ్డు పనులు ప్రారంభించి రెండు నెలలు దాటినా.. పనులు మాత్రం ముందుకు సాగటం లేదు. మొక్కు బడిగా, నత్తనడకన సాగుతుం డడంతో ఈ రహదారికి ఇప్పట్లో మోక్షం కలిగేలా లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు సాగునీటి కాలువాను తలపించిన సంగతి తెలిసిందే. నిత్యం వందలాది మంది ప్రయాణించే ఈ రహదారికి శిలాఫల కానికే పరిమితం అన్న బావన గ్రామస్థుల్లో ఉంది. ప్రజా ప్రతినిధులు ఎన్నికల తంతుగా ఈ పనులు ప్రారంభించి ప్రజలను మభ్పి పెట్టే ఆలోచన అని ప్రజలు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కిమిడి కళావెంకటరావు బీటీ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. 30 శాతం నిర్మాణ పనులు చేయలేదనే నెపంతో నిలిపివేశారు. మరి వైసీపీ వేసిన శిలాఫలకానికి న్యాయం చేస్తారా లేదా అని ప్రజలు చర్చించు కుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అసంపూర్తిగా ఉన్న రహదారి పనులు

ఓటుతో వైసీపీని తరిమికొట్టాలి

జి.సిగడాం: అవినీతికి ఆజ్యం పోసిన వైసీపీని రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి తరిమి కొట్టాలని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్), కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం, బీజేపీతోనే దేశంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు మరోసారి మోదీని, చంద్రబాబును గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, వజ్జపర్తి రుఘురాం, మీసాల రవికుమార్, బోగాది అప్పలనాయుడు, ఆరెళ్ల గొల్లాజీ, కోన వెంకటరావు, మీసాల ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే శేతుభీమవరం పంచాయతీ (పెనసాం) వైసీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కుదిరెళ్ల వెంకటరావుతో పాటు పలు వైసీపీ కుటుంబాలు ఎన్ఈఆర్, కలిశెట్టి సమక్షంలో మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన శేతుభీమవరం, పెనసాం, గంగన్నదొరపాలెం గ్రామానికి చెందిన కె.ఈశ్వరరావు, ఎన్.పైడిరాజు, జగన్మోహన్, శ్రీను, నరేష్, సత్యం, త్రినాథ, జగదీశ్వరరావు, కామేష్‌లతో పాటు పలువురికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్డీఏ కూటమి గెలుపునకు కృషిచేయాలన్నారు.


ఎన్ఈఆర్, కలిశెట్టికి తిలకం దిద్దుతున్న మహిళలు

పింఛన్ సొమ్ము దోచేసింది జగన్‌రెడ్డే: శంకర్


అరసవల్లి: ఎంపీడీవోకు వినతిపత్రాన్నిస్తున్న గొండు శంకర్ తదితరులు

అరసవల్లి: పింఛన్ల సొమ్ముతో పాటుగా ప్రభుత్వ నిధులు రూ.13వేల కోట్లు ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా జగన్‌రెడ్డి తన సొంత కాంట్రాక్టర్లకు దోచి పెట్టారని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్‌ను సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవోను కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి స్వార్థ రాజకీయం వల్లనే వలంటీర్లు, పింఛన్‌దారులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, పాండ్రంకి శంకర్, ఇప్పిలి తిరుమల, బొల్ల నాగేంద్రయాదవ్, బుర్రి మధు, రెడ్డి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ కార్యాలయాన్ని స్థానిక విశాఖ-ఎ కాలనీలో కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్డీఏ కూటమి ఏర్పాటయిందన్నారు. అనంతరం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన పుట్టా వెంకటేశ్వరరావు, పలువురు మత్స్యకారులను పార్టీ కండువాలు వేసి సాధారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ సర్వేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, చల్లా వాసు, కోరాడ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

160 స్థానాల్లో కూటమి విజయం: కూన


సరుబుజ్జిలి: సూపర్‌సిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న రవికుమార్


సరుబుజ్జిలి/ ఆమదాలవలస: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి 160 స్థానాల్లో విజయం సాధిస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలి పారు. మంగళవారం మండలంలోని మర్రిపాడు, బురిడివలస, మర్రిపాడుకాలనీ, బురిడి వలస కాలనీలో బీజేపీ, జనసేన కన్వీనర్లు పేడాడ సూరపునాయుడు, పేడాడ రామ్మోహన్‌తో కలిసి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమదాలవలస అయన విలేకరులతో మాట్లాడుతూ సైకో జగన్‌రెడ్డి అవినీతి పాలనకు రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు శివ్వాల సూర్యనారా యణ, అంబళ్ల రాంబాబు, కిల్లి సిద్దార్థ, లావేటి పూర్ణారావు, పల్లి సురేష్, నూక ప్రభాకర్, కె.రవికుమార్, వై.రామారావు పాల్గొన్నారు.

- **కంచిలి:** మండలంలోని చిన్నకొజ్జిరియలో టీడీపీ నాయకులు మంగళవారం సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మాదిన రామారావు, బంగారు కురయ్య, తమరాల శోభన్‌బాబు, పైల రామారావు, టీవీ రమణ, సనపల కామేష్, ముద్దపు రమణ, పిలక చినబాబు,పి సూర్యనారాయణరెడ్డి, ప్రదీప్, అప్పారావు పాల్గొన్నారు.
- **కవిటి:** మండలంలోని కరాపాడు,కొజ్జిరియా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. పర్యటనలో నేతలు 'మణిచంద్రప్రకాష్, పి.కృష్ణారావు, బి.రమేష్, రంగారౌళో,పి.రాజు, బి.తిరుమలరావు,బి.శంకరరావు పాల్గొ న్నారు.

ఇంటివద్దే పింఛన్లు పంపిణీ చేయాలి


కలెక్టర్‌కు వినతి పత్రాన్నిస్తున్న టీడీపీ నాయకులు

అరసవల్లి: వృద్ధులు, వికలాంగులు, ఇతర పింఛన్‌దారులకు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌కు మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. వలంటీర్లకు బదులుగా సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శుల తో పింఛన్లను పంపిణీ చేయించాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రత్యామ్నా య మార్గాల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఇంటి వద్దకే పింఛన్ల ను పంపిణీ చేసే విధానాన్ని టీడీపీ అడ్డుకుందని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి రూ.13 వేల కోట్ల పింఛన్ డబ్బులతో పాటు వివిధ పథకా ల సొమ్మును జగన్‌రెడ్డి ప్రభుత్వం తమ కాంట్రాక్టర్లకు దోచిపెట్టిందని, దీంతో ఖజా నాలో పింఛన్లను సరిపడా నిధులు లేకుండా పోయాయన్నారు. అందువల్ల ఆలస్య మవుతుందని, ఈ విషయంలో ప్రభుత్వం త్వరగా ఈ కార్యక్రమంలో బొనిగి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


సోంపేట: ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

- **సోంపేట:** వృద్ధులు, దివ్యాంగులు, వితంతు పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించేలా ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈమేరకు ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, మడ్డు రవి, దూసి మదుసూధన్, చిత్రాడ శేఖర్ పాల్గొన్నారు.


ఎచ్చెర్లలో ఎంపీడీవోకి వినతిపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నేతలు

- **ఎచ్చెర్ల:** ఎన్నికల కోడ్ నేపథ్యంలో సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని టీడీపీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో రమాదేవిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు పింఛన్లు అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెండు మల్లేశ్వరరావు, వావిలపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంచమ్మతల్లి సంబరాలు


కంచమ్మ ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

కంచిలి: కంచిలి గ్రామ ఆరాధ్యదేవత కంచమ్మతల్లి చల్లదనం సంబరాలను కంచిలి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా మేళతాళాలతో కంచమ్మతల్లి ఘటాలను గ్రామ పధాన వీధుల్లో ఊరేగించారు.

కార్మికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

అరసవల్లి: వేసవి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదై, వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికల నేపథ్యంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు రక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం ఉప కార్మిక కమిషనర్ ప్రసాదరావు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వివిధ పరిశ్రమలు, సంస్థలు, కర్మాగారాలు, వర్క్‌షాపులు, ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులపై ఎండ తీవ్రత, ప్రతికూల ప్రభావం పడకుండా చూడాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కష్టతరమైన పనులు చేసే కార్మికులకు పని వేళలను రీ-షెడ్యూల్ చేయాలని, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వారిని పనికి దూరంగా ఉంచాలని తెలిపారు. ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలోనే వారు పనులు చేసేలా చూడాలని కోరారు. పని ప్రదేశంలో నీడ ఉండేలా చూడడంతో పాటు, సురక్షితమైన తాగునీరు, అత్యవసర ఔషధాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితరాలను అందుబాటులో ఉంచాలన్నారు.

కిడ్నీలో ఆరు సెంటీమీటర్ల రాయి


కిడ్నీ నుంచి తొలగించిన రాయి

గుజరాతీపేట: శ్రీకాకుళం నగరంలోని గ్లోబల్ న్యూరో కేర్ హస్పిటల్‌లో యూరాలజిస్ట్ బొడ్డేపల్లి యోగేష్, అన స్థీసియో గోనప భవానీ ఆధ్వర్యంలో కిడ్నీ సర్జరీ చేసి ఆరు సెంటీమీటర్ల రాయిని తొలగించినట్టు వైద్యులు దేవిరెడ్డి గౌతమ్ తెలిపారు. సాధారణంగా 0.5 సెంటీమీటర్ కంటే ఎక్కువ ఉన్న కిడ్నీ స్టోన్‌లకు శస్త్రచికిత్స అవస రమని, ఇంత పెద్ద పరిమాణం గల స్టోన్ చాలా అరు దుగా తయారవుతుందన్నారు. తద్వారా కిడ్నీ ఇన్ఫెక్షన్, కిడ్నీ వైఫల్యం కలుగుతూ ఉంటాయన్నారు. ఈ శస్త్ర చికి త్సలో కిడ్నీని తెరిచి స్టోన్‌ను తొలగించినట్టు డాక్టర్ యో గేష్ తెలిపారు. ఈ సర్జరీ చేయడానికి సుమారు మూడు గంటల సమయం పట్టిందని, గ్లోబల్ న్యూరోకేర్ ఆసుపత్రి లో అత్యాధునిక సౌకర్యాలు ఉండడంతో సాధ్యపడింద న్నారు. శస్త్ర చికిత్స విజయవంతం కావడంతో వైద్యులను ఆసుప త్రి సిబ్బంది, వైద్యులు గౌతమ్ అభినందించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

ఎచ్చెర్ల: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లోని ట్రిపుల్ ఐటీ విద్యార్థులను ఉద్దేశించి మంగళవారం కలెక్టర్ మాట్లాడారు. ప్రణాళికాబద్ధంగా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఉన్నత స్థాయికి చేరినవారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ ఎం.నవీన్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పాటించాలి

లావేరు: విద్యా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌డీవీ రమణ అన్నారు. మంగళవారం మురపాక కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేజీబీవీ పాఠశాల మిగిలిన పాఠశాలలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వివిధ తరగతి గదులు కిచిన్, పాఠశాల ఆవరణలో పెంచుతున్న మొక్కలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీసీడీవో ఎస్.నీరజ, స్థానిక పాఠశాల ప్రత్యేకాధికారిణి బి.సుధ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ దర్శనానికి భక్తులు


ఆలయం వద్ద భారీగా భక్తులు

పొందూరు: పొందూరులో పైడితల్లి అమ్మవారి దర్శనానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. జాతర మూడో రోజు ఉదయం నుంచే ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. కమిటీతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు మంచి నీటిని, మజ్జిగను ఏర్పాటు చేశాయి. భక్తులకు ఆలయ కమిటీతో పాటు పొందూరు సర్పంచ్ కాకర్ల పైడిలింగం మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న సుదర్శన్ దొర

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం, ర్యాలీలు నిర్వహిస్తే అనుమతి తప్పనిసరి అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమా వేశం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు కాళ్ల ధర్మారావు, పైల దేవదాస్‌రెడ్డి, బుద్ధాల నిర్మలారెడ్డి పాల్గొన్నారు.

నిమ్మాశిని అమ్మవారికి పూజలు

సోంపేట: సోంపేటలో మూడురోజుల పాటు నిర్వహించనున్న నిమ్మాశిని అమ్మవారి జాతరలో మాజీ మంత్రి గౌతుశివాజీ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

మెళియాపుట్టి: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలని పాతపట్నం నియోజకవర్గ ఆర్వో సీతారామారావు కోరారు. సోమవారం మెళియాపుట్టి తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. ఓటు విలువ తెలుసుకొని ప్రతి ఒక్కరినీ చైతన్యం చేయాలని కోరారు. 18 ఏళ్ల నిండిన వారు ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

నందిగాం: ఓటుహక్కు వినియోగంపై మద్దిలివానిపేటలో మంగళవారం అవగాహన కల్పించారు. వెలుగు ఆధ్వర్యంల ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఎటువంటి ప్రలోబాలకు లోనుకాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సద్వినియోగం చేసుకోండి

జలుమూరు: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని రాణ పంచాయతీ కార్యదర్శి సాయి అన్నారు. రాణ సచివాలయం పరిధిలోని గొలియాపుట్టి గ్రామంలో మంగళవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో అర్జునరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.



నందిగాం: ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



జలుమూరు: గొలియాపుట్టిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు